

# థూ...

పి.వి. సునీల్‌కుమార్

ముసలి లంజకొడుకు ఎంత పని చేసేడు? పెద్దాయన అనికూడా చూడకుండా థూ... అని మొహం మీద ఉమ్మేడు. అసలు ముసలాడికి గత ఇరవై ఏళ్లుగా ఏదో జబ్బు చేసి ఉమ్ము రావడం లేదు. లాలాజలం రాకపోవడంతో వాడి నోరు ఎండి పోయి నెరళ్లు విచ్చుకున్న బీడు పొలంలా ఉండేది.

ఇరవై ఏళ్లక్రితం వాడికి తల మీద తగిలిన దెబ్బతో కొంత మతి చలించిన మాట వాస్తవం. ఎప్పుడూ ఏదో గొణుక్కుంటూ, సణుక్కుంటూ ఉంటాడు. ఆ దెబ్బ వల్లే వాడికి ఉమ్మి రావడం కూడా ఆగిపోయింది. డాక్టర్లు దానికి జెరోస్టోమియా అని ఇంగ్లీషు పేరెట్టారు. కానీ ముసిలాడి దగ్గర ఇండియా కరెన్సీ దమ్మిడీ లేకపోవడంతో, వాడికి వైద్యం చెయ్యలేమని తెలుగులో చెప్పి తోలేశారు.

అప్పుడు వాడికి డాక్టరుమీద ఊద్దామనిపించింది. కానీ ఉమ్ము రాలేదు. అసలు వాడి జబ్బే అది కదా.

ఇరవై ఏళ్లుగా వాడికి చాలామంది మీద ఊద్దామనిపించింది. కానీ ఉమ్ము రాలేదు. వాడి పేరు జోసప్పు. వాడి కథ వాడే చెప్పుకుంటే ఏం బావుంటుంది. వాడి కథా, వాడి ఊరి కథ బసివిరెడ్డినాయుడుగారు చెబితే బావుంటుంది. బసివిరెడ్డినాయుడుగారు చెప్పాక, కుంటి జోసప్పుకి కూడా ఓ చాన్సిద్దాం.

ఇంతకీ ఈ దొంగ నా కొడుకు ఎవరి మీద వూసేడు? ఎందుకు వూసేడు? ముందు రెడ్డినాయుడు గారిని చెప్పనిద్దాం.

*

**బసివిరెడ్డినాయుడుగారు చెప్పిన కథ**

నేను చెప్పేది చిన్న కథండి. ఏదో ఈ రచైతగారి మాట తీసెయ్య లేక చెప్పటమేనండి. ఎందుకంటే మనం మర్యాదస్థులం కదండి. గబుక్కున ఎవరి మాటా తీసేయ్యలే మండి. అలా అని అబద్ధమూ చెప్పలేం. బసివిరెడ్డినాయుడుగారు అబద్ధమాడాడంటే కృష్ణమ్మ పొంగి బెజవాడ కనకదుర్గమ్మ ముక్కుపుడక అంటుకున్నట్టే అంటారండీ మా ఊరి జనం.

నా పేరులో చిన్న గమ్మత్తుందండి. మా తండ్రి గారు రెడ్డి కులస్తుడు. అమ్మ గారు కమ్మవారి ఆడపడుచు. ఇంకా ఈ కాలంలో కులాలేంటండి. అందరం కలిసి పోయి ఉంటుంటే. మా తాతల పేర్లు, కులాలు అలా నా పేరులో చేరాయి. చిత్తూరు జిల్లాలో కమ్మవారిని నాయుడు అని అంటారు. కోస్తాలో నాయుడు అంటే కాపువారు. సరే ఆ గొడవ అలా వదిలేద్దాం.

కాలం ఎంత మారిపోయింది. మారిపోవడమే కాదు. పరమ దుర్మార్గంగా మారిపోయింది. పరమ నీచంగా మారిపోయింది. న్యాయం, ధర్మం అనే వాటికి స్థానం కనపడటమే లేదు.

ధర్మం నాలుగుపాదాలా నడిస్తే అది రామ రాజ్యం. అలాంటిది తెద్దామనే అన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నం చేస్తుంటయ్యి. కానీ కుదిరి చావద్దూ?

ధర్మం నాలుగు పాదాలా నడవటం అంటే ఏమిటి? చివరికి ఇది కూడా చెప్పు కోవల్సిరావడమంటే మనం పిదపకాలంలో వున్నామనడానికి ఆనమాలు. ఇంతకన్నా మరేం కావాలి?

ధర్మానికి నాలుగు పాదాలు, వర్ణాలకూ నాలుగు పాదాలు. నాలుగు వర్ణాలు అంటే బ్రాహ్మణ, క్షత్రియ,

వైశ్య, శూద్రులు. ఈ నాలుగు వర్ణాలకూ చెందిన జనాలకి వాళ్ల వాళ్ల పనులు నిర్ణయమైపోయి ఉన్నాయి. అంటే ఇప్పుడు సాఫ్ట్‌వేర్‌లో పనిచేస్తున్న మా మనవళ్ల భాషలో చెప్పాలంటే జాబ్ చార్ట్ అన్నమాట.

ఇప్పుడు నువ్వు బ్రాహ్మణ వర్ణంలో పుట్టావు అనుకుందాం. ఊరికే... అనుకుందాం. బ్రాహ్మడిగా పుట్టాలంటే ఎంతో పుణ్యం చేసుకుని ఉండాలి. అది కూడా ఇప్పుడు కాదు, పూర్వజన్మలో. సరే బ్రాహ్మడిగా పుట్టిన తర్వాత నేను చెప్పులు కుడతా, పెంటలు ఎత్తుతా అంటే కుదరదు.

మరేం చెయ్యాలి?

పూజలు చెయ్యాలి. యజ్ఞాలు, యాగాలు చెయ్యాలి. చదువు చెప్పాలి. నిజం... నిజం... చదువు ద్వారా పాపపుణ్యాలు, నరకస్వర్గాలు ప్రచారం చేసి భయపెట్టకపోతే ఏ నాయాలూ మన మాట వినడు. పత్రికల్లో, టీవీల్లో చేరి, 'ఇంకా కులమెక్కడ ఉందిరా కుంకల్లారా,' అని దబాయించవచ్చు.

సరే ఈ పూజలూ, చదువులూ గిట్టుబాటు కాకపోతే వెసులుబాటును బట్టి రాజకీయాలు చెయ్యవచ్చు. కరణం, మునసబుగిరీలు చెయ్యవచ్చు. సిమెంటు అమ్మవచ్చు. క్రికెట్టు అసోసియేషన్ ప్రెసిడెంటయి దేశానికి ఆడే పదకొండుమందిలో ఆరుగురికి తగ్గకుండా బ్రాహ్మలుండేలా సాయం చెయ్యవచ్చు. మన అల్లుడు మేచ్ ఫిక్సింగ్ చేయవచ్చు. వచ్చు... వచ్చు...

అలా ధర్మం ఒక పాదం కాపు కాయాలి.

సరే ఇక క్షత్రియపుత్రుడివా... రాజ్యమూ, వీరపూజ్యమూ నీవే. నీ ఇష్టం వచ్చింది చేయవచ్చు. వైశ్యుడివా... వ్యవసాయం, వ్యాపారం నీవే. వ్యాపారం నీదైతే లక్ష్మీదేవి నీ ఇంట ఉంటుంది. నీ ఇంట లక్ష్మీదేవి వుంటే ఆవిడ ఇంటర్వ్యూ కోసం ఢిల్లీ సుల్తాను తలవంచి, వీపు వంచి ఇంకా ఏమేం వీలైతే అవి వంచి నీ ముందు అడుక్కుంటాడు. అనుమానం ఉంటే బొంబాయిలో అంబానీ బాబాయి అని ఉంటాడు. ఆయన్ని అడుగు. ఎంతమంది సుల్తానులు, జనం ఓట్లేసి గెలిపించిన సన్నాసి వస్తాదులు ఆయన ముందు సాగిలపడ్డారో ఫోటోలతో సహా చూపిస్తాడు.

ఇక మిగిలింది శూద్రులు. అంటే మాలాంటి రెడ్లు, కమ్మవారు మాత్రమే కాకుండా కమ్మరి, దొమ్మరి, చాకలి, మంగలివారిని కూడా శూద్రులే అనేవారు పూర్వం. ఈ శూద్రులంతా పై మూడు వర్ణాలకూ సేవలు చెయ్యాలి. అదికాకుండా వ్యవసాయం, వారి వారి కుల వృత్తులు చేసుకుంటూ అందరికీ బట్టా, కూడు ఇవ్వాలి.

శూద్రులు కష్టపడి సమాజానికి పనికొచ్చే పనులు చేస్తే పై మూడు వర్ణాలూ దొబ్బితిని పెత్తనం చేస్తారు అని గిట్టనివాళ్లు అంటూ ఉంటారు.

సరే ఇలా ఎవడి పని వాడు చేస్తే ఇది రామరాజ్యం. అందుకే రాముడు ఏం చేసేడో తెలుసా? వేదం చదివాడని ఓ మాలమాదిగోడి తల తీసేశాడు. ఇంకోడి పనిలో ఏలెడితే ఏలూ, కాలెడితే కాలూ లేచిపోతయ్యి. అదీ రామబాణం అంటే. అదీ రాములోరంటే. అదీ రామరాజ్యం అంటే.

ఈ వర్ణంలో పుట్టినోడు ఈ పనే ఎందుకు చెయ్యాలీ అంటే.. ఒక్కటే సమాధానం. నువ్వు డాక్టరీ చదివి వంతెన కడతావా పిచ్చినాగన్నా? నువ్వు ఇంజనీరింగు చదివి ఎవడి కడుపన్నా కోస్తానంటే ఒప్పుకుంటారా? ఒప్పుకోరు. నీకంత జనాన్ని చంపాలనుంటే డొనేషన్ కట్టి ఇంజనీరు అయ్యి ఆనక బ్రిడ్జి కట్టు. దాని మీద పోయినోడు పోతాడు. బతికినోడు బతుకుతాడు. అలా నీ విద్వత్తుని బట్టి, విద్యని బట్టి, యోగ్యతని బట్టి, అర్హతని బట్టి నీ పని నువ్వు చెయ్యాలి. అదీ రామరాజ్యం.

మన పూజ్య బాపూజీ, జాతిపిత గాంధీజీ కలలు కన్నది ఈ రామరాజ్యం గురించేనండి. ప్రతీ మనిషికీ వర్ణం ఉంది. ఆ వర్ణానికి ఓ ధర్మం ఉంది. అంటే ఏ వృత్తి చేయాలి, ఎంత ఎత్తు ఎగరాలి అని అండి. అలవాటు లేని ఆపోసన పడితే మూతిమీసాలు కాలాయని, అంటరానివాడు అందలాలెక్కాలని ఒకేసారి ఎగిరితే నడుములు జారిపోవా అండి. మనం పెద్ద మనుషులం కాబట్టి సాయం పడతాం. మన సాయంతో నెమ్మదిగా వాళ్లు కూడా పైకి రావాలండి. దానికి పడితే మహా అయితే మరో నాలుగైదు వేల ఏళ్లు పట్టచ్చు. కాదంటే ఇంకో మూడునాలుగు వేల ఏళ్లు. అంతే కదండీ. నెమ్మది ముఖ్యం.

అయితే అయ్యా ఓ చిక్కొచ్చిపడింది. నాలుగు వర్ణాలన్నపుడు ఈ మాల మాదిగోళ్లు ఎక్కడినుండి ఊడిపడ్డారు? వద్దాం అక్కడికీ వద్దాం.

అయితే దానికంటే ముందు ఇంకో చిక్కొచ్చిపడింది. కుమ్మరి, కమ్మరి, చాకలి, సాలి, కాపు లాంటి వాళ్లూ మాలాంటి రెడ్డిగార్లూ, కమ్మవారూ కూడా శూద్రులమేనా? అంతా ఒకటేనా?

కుమ్మరికి సారె, కమ్మరికి కొలిమి, సాలోడికి మగ్గం, చాకలికి చాకిరేవూ, కాపుకు పనులు ఉన్నాయి. మాకు పొలాలున్నాయి. అంటే రెడ్డి, కమ్మవారికి పొలాలున్నాయి. మేం భూస్వాములం. తెలుగులో చెప్పా

లంటే భూమికి అమ్మామొగుళ్లం. ఇలాంటి మేమూ... ముడ్డికింద జాగా తప్ప ముడ్డెనకమాల అరెకరం కూడా లేని ఫకీరు కులాలూ సమానం అనడంలో ఏదో దెబ్బ తింది.

రామరాజ్యం అన్న మాటలో ఏదో బెడిసింది. అయితే ఇది పెద్ద విషయం కాదు. బ్రాహ్మల్ని చెవి మెలేసేసరికి అయ్యా... కామందులవారు అందరికంటే గొప్పవారు... అని కామా ఫులుస్టాపూ లేకుండా ఒప్పుకుని క్షాత్రమున్న వారంతా క్షత్రియులే... కానీ రాజ్యమున్నవారే రాజులు. రాజ్యాన్ని ఎడాపెడా తమరే ఎక్కి ఏలేస్తన్నారు కనుక మీరే రాజులు అనగా క్షత్రియులు అని ఒప్పించే సరికి చాలా కష్టం అయింది.

సరే... నయానో భయానో ఈ గొడవంతా ఓ దారికి తెచ్చేం.

స్వాతంత్ర్యం వచ్చిం తర్వాత మా రెడ్లంతా జాతీయ పార్టీలో చేరి యధాశక్తి దేశసేవ చేస్తూ వచ్చాం. కింద కులాలందరికీ అయితే అచ్చిరెడ్డినీ, అతడు నచ్చకుంటే పిచ్చిరెడ్డినీ ఎన్నుకునే స్వేచ్ఛనిచ్చాం. కష్టపడి ఓట్లేయించుకున్నందుకు, కారుల్లో తిరుగుతా కష్టపడి నందుకు, ఏసీ రూముల్లో రాత్రనకా పగలనకా దేశసేవ చేసినందుకు మా రెడ్లు ముఖ్యమంత్రులయి, మంత్రు లయి దేశమాత ఋణం తీర్చుకుంటున్నారు.

సరే... కష్టమో, నష్టమో ప్రజా పాలనా భారం ఎవడో ఒకడు మోయాలిగా. అందుకే మా రెడ్లంతా కష్ట పడి మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా నానా బాధలూ పడతా వస్తన్నాం.

ఇక మాకు సాయంగా ఉండేందుకు కొందరు రెడ్లు కాంట్రాక్టర్లుగా, వ్యాపారస్తులుగా ఉంటూ ప్రభుత్వ కాంట్రాక్టులు అంటే రోడ్లు వేయడాలూ, ప్రాజెక్టులు కట్టడాలూ చేస్తూ అడ్డమైన కష్టాలూ పడతా వున్నారు. అయితే ఏం.. ప్రజలకు సేవ చేశాం అన్న తృప్తి వాళ్లకి మిగిలింది. లక్షల్లో, కోట్లో... కాస్త డబ్బు చేరింది. కష్టేఫలీ అన్నారు.

మజ్జెలో కమ్మవారికి కూడా ప్రజాసేవ చేయాలన్న యావ పుట్టింది.

వారు తెలుగువాడి ఆత్మగౌరవం పేరుతో కమ్మ పార్టీ పెట్టి వారు కూడా యధాశక్తి దేశసేవ మొదలెట్టారు.

ఇప్పుడు జనానికి మంచి అవకాశమొచ్చింది. అయితే రెడ్డిపార్టీని కాకుంటే కమ్మ పార్టీని ఎన్నుకోవచ్చు. చూసేవా ప్రభుత్వాన్ని మార్చేశాం... మా ఓటుకున్న దమ్ము చూడండి అనుకోవచ్చు.

ఒక్క విషయం అండీ. మీరు చికెన్ బిర్యానీ అనండి, చికెన్ కూర అనండి, చికెన్ మంచూరియా అనండి అందులో చివరికి ఉండేది చికెనే కదా. అలానే పార్టీలని తరచి చూస్తే ఆ పార్టీకి హెడ్డు ఖచ్చితంగా కమ్మ కానీ రెడ్డి కానీ అయివుంటాడు. పేరుకి వంద సిద్ధాం తాలు చెప్పచ్చు కానీ వంద కులాలవాళ్లలో ఏ ఒక్కళ్లనీ ఆ పార్టీలు నెత్తినెక్కించుకోలేవు.

మీరు కాంగ్రెసు అనండి, బిజెపి అనండి, కమ్యూ నిస్టనండి, తెలుగుదేశం అనండి ఏదైనా అనండి. చివరికి దాని అధిపతి ఈ రెండు కులాలవాళ్లే అయి వుంటారు. ఒక వేళ ఏ బీసీనో, యస్సీనో తాత్కాలికంగా పార్టీ అధ్య క్షుడిగా చెయ్యచ్చుగానీ సీయంని చేసేసరికి ఈ రెండు కులాలే రావాలి తప్ప ఇంకో కులపోడ్ని సీయం చేసే దమ్ము ఏ పార్టీకీ లేదండి.

అయితే పార్టీలని నమ్ముకున్న మాలమాదిగ నా కొడుకులకి మనం ఏ రోజూ అన్యాయం చెయ్యలేదు. మనకి అంత అన్యాయం అక్కర్లేదు. మనల్ని నమ్ము కున్నం దుకు ఆళ్లకి గేదెలు, పందులు, ఆటోలు ఇచ్చాం. అంటే లోనుమీద. అలాగే వాళ్లకి విశాలమైన ఇళ్లుకూడా కట్టిచ్చాం. మన రైతుల ఇళ్లల్లో ఉచ్చల దొడ్లుంటాయే... అంతకంటే విశాలంగా వుంటాయి యిప్పుడాళ్ల ఇళ్లు.

అదొకటేనా... ఎలక్షను వచ్చినపుడల్లా నాకొడుకు లకి మనుగుడుపు పెళ్లి కొడుకుల్లాగా రోజూ మందూ, బిర్యానీ పొట్లం, వందో రెండొందలో కట్నం. పోనివ్వండి ముండాకొడుకుల్ని. ఆళ్లూ బతకాలిగా. మనకీ దయా జాలీ ఉండాలిగా.

మన రెడ్లు, కమ్మవారూ నానా గడ్డీ కరిచి, ఆ వ్యాపారమనీ ఈ వ్యాపారమనీ, కాంట్రాక్టనీ, బిల్లులనీ, అప్పులనీ జెల్లకాయలు తినేసి అల్లాడిపోతున్నారు. గిట్ట నోళ్లు అంటారు. గవర్నమెంటు ఈ రెండు కులాల చేతిలో వుంది కనుక కాంట్రాక్టులు మీరే మేస్తారు. ఆ కాంట్రాక్టు చేతిలో వుంటే బేంకోడు లోనిస్తాడు. అంటే జనం సొమ్ము. అలా జనం ఏసిన ఓట్లతో అధికారం, అధికారం వల్ల కాంట్రాక్టు, కాంట్రాక్టు వల్ల డబ్బూ చేరు తుంది. మొత్తానికి సొమ్ము జనానిది, అంటే వందలాది కులాలది, సోకు మాత్రం ఈ రెండుకులాలది అని గిట్టని ఎదవలు వాగుతుంటారు.

మేడా, కారు, ఏసీ వుంటే సుఖమా? ఎన్ని పుర్రాకులు? ఎన్ని గొడవలు? ఈ మాలమాదిగలు పెట్టి పుట్టారు. కష్టపడకుండా, కాలు కదపకుండా మను

గుడుపులు. పోనీండి. అందరం మనుషులమే. ఒకడి సుఖం చూసి మనం ఏడవకూడదు. మన కష్టం వాడికి పంచకూడదు. ఈ రాజ్యాధికారాలూ, రాజకీయాలూ, వ్యాపారాలూ పరమ రొచ్చు. ముళ్ల కంప. ఏసుప్రభువు నెత్తిన ముళ్ల కిరీటం. మనం వాళ్లని కష్టపెట్టకూడదు. పాపం మాల మాదిగలు. ఎన్నో కష్టాలు పడ్డారు. ఇప్పుడు సుఖపడనీండి.

అందుకే ఆళ్ల పిల్లలకి రిజర్వేషన్ అని పెట్టి మార్కులు తక్కువ వచ్చినా చదువూ, ఉద్యోగాలూ ఇస్తన్నాం. యంయల్ఏలుగా మంత్రులుగా కూడా వాళ్లని చేస్తున్నాం. అంటే హోమూ, ఇరిగేషను లాంటివి వాళ్లు బాధపడలేరని జాగర్తగా బర్రెల శాఖా, గొర్రెల శాఖా, అచ్చేసే శాఖా అని ఆళ్లకి కష్టంలేనివి...కాస్త చులాగ్గా ఉండేవి ఇచ్చి జాగ్రత్తగా చూసుకుంటున్నాం.

ఆర్యా... కులం అంటే ఏంటండీ? కుటుంబం అనేదాన్ని కొంచెం సాగదీస్తే అదే కులం. అంటే మన కులపోళ్లంతా మన కుటుంబ సభ్యులు. అట్టాంటప్పుడు మన ఇంట్లో వాళ్లకి పెట్టుకున్నాక మిగిలిందే కదండీ బయటోళ్లకి పెడతాం. ఇందులో అన్యాయం ఏముం దండీ? ఎవడైనా సొంత కొడుకుని పస్తుపెట్టి పక్కింటి పిల్లాడికి పరమాణ్ణం పెడతాడా?

అలాగే మన రెడ్లు, కమ్మవారు ముందు తమ పిల్లలకి పెట్టుకుని మిగిలింది తప్పకుండా ఇతర కులా లకి పెడతాం... పంచుతాం... అంతా మనకే ఎందుకు?

అయ్యా... ఇంతెందుకు చెప్పేనంటే... ఎంత వుప కారం చెయ్యి, మనుషులకి విశ్వాసం ఉండదు. అది చెప్పడానికే ఇదంతా.

ఒకప్పుడు చదూకోడానికి పనికిరారన్న మాల మాదిగల్ని చదూకోండ్రా అని కాలేజి బళ్లకి రానిస్తే ఈ నా కొడుకులు చదువు మానేసి మన పెద్ద కులాల ఆడపిల్లల్ని చూడ్డం మొదలెట్టారు.

బట్టలు కట్టుకోకుండా గోచీ పెట్టుకున్న ఈళ్లని పాంటు చొక్కాలు తొడుక్కోనిచ్చేసరికి బాగా బలిసి మిడిసిపడతన్నారు. కామందుల ఆడపిల్లలని కూడా చూడకుండా ఆళ్లని తేరిపారచూడ్డం...

కలికాలం అంటే.. ఇదే.

కొందరైతే కామందుల పిల్లల్ని చూసి ఈలే యడం... లవ్‌లెటర్లు అని ఇవ్వడం... ఇలాంటి ఛండాలమంతా మొదలైంది.

ఇంతకు ముందెప్పుడైనా చద్దికూడు తప్ప మరోటి ఎరుగుదురా ఈళ్లు? ఇప్పుడు హోటల్లో టిఫిన్లు మరిగారు. ఎంత దర్జా... కుక్క దర్జా? రెడ్డిగారు దారిని పోతున్నారన్న ఇంగితం కూడా లేకుండా కాలు మీద కాలేసుకునీ, కాళ్లు జాపుకునీ టిఫిన్లు తింటా వుంటారు... కాఫీ టీలు ఊదుకు తాగుతూ వుంటారు. పోనీలే హోటల్లో తిననిస్తన్నాం అనికూడా లేకుండా ఇక్కడ రెండు గ్లాసులేంటి? మా గ్లాసు మేము ఎందుకు తెచ్చు కోవాలీ అని ఎదవ గొడవ. రెడ్లు, కమ్మవారు తాగే కప్పు ల్లోనే ఈ నా కొడుకులు కూడా తాగుతారంటండీ. ఆ ఎంగిలి కప్పుల్లో మళ్లా కామందులు కాపీ, టీలు తాగాల టండి. ఎంత ఇతండం.

ఈ జోసప్పగాడి కొడుకు మరీని. రాజు ఆడి పేరు. ఏ దేశానికి రాజో. ఇరవై ఏళ్లక్రితం గొడవ అది. నాకింకా బాగా గుర్తు.

ఈ రాజుగాడు ఎర్రగా, బుర్రగా, నదరుగా బలిసిన గొడ్డల్లే వుంటాడు. ఈడో భూస్వామిగారి అమ్మాయి వెంటపడ్డాడు. ఆ పిల్ల ఈడితోటే చదివేది. ఏదో ఈడి మాయలో పడినట్టుంది. లేక భయపడి ఒప్పు కుందో. ఈడితో కాస్త చనువుగా వున్న మాట వాస్తవం. చెప్పేనుకదా బసివిరెడ్డి అబద్దమాడితే ఏమవుతుందో!

అయితే మన పక్కనున్న తణుకు టౌనులో కాలేజి చదువుకని బస్సులో మనూరొచ్చేవాళ్లండి ఈ కుర్రమేళమంతాని.

ఆ బస్సులో ఈ రాజుగాడు ఆ పిల్లని గోకుతూ ఉంటే పాపం ఆడబిడ్డ చెప్పుకోలేక అల్లలాడిందండీ. అదిచూసి మన కామందుల కుర్రాళ్లకి మండి రాజు గాడ్ని, 'ఏరా... నువ్వు చేత్తన్నది పొరపాటు పనికాదా,' అని అడిగారండి. అయితే ఆ కోపంలో, 'ఏరా మాలనా కొడకా,' అన్న మాట వాడేరండీ. అబద్ధం కాదు. మాల నాకొడుకుని మాల నాకొడుకని, మాదిగ నాయాల్ని మాదిగ నాయాలని అనక మరేమంటారండీ... నాకు తెలీక అడుగుతాను.

నీ కులం నీకు తిట్టులాగా ఉందా? అన్యాయం కదండీ. నన్ను రెడ్డీ అంటారు. అది నేను తిట్టను కుంటానా? కమ్మాయన్ని చౌదరిగారని, కొన్ని చోట్ల నాయుడుగారని అంటారు అది తిట్టా?

సరే వదిలేయండి. మాటా మాటా పెరిగింది. అక్కడితో ఆగాలా? ఆ రాజుగాడు ఆడికి తోడు మిగిలిన మాలమాదిగ కుర్రనాయాళ్లు కలిసి కామందుల పిల్లల్ని, కనీసం పెద్ద ఇళ్ల పిల్లలే అన్న ఇంగితం లేకుండా, పెద్దం తరం, చిన్నంతరం లేకుండా చెయ్యి చేసుకున్నారండీ... ఎంత దారుణం.

రామరాజ్యం కోసం కలలు కన్న గాంధీగారు, ఇప్పుడు కలలు కంటున్న మోదీగారు ఈ సంగత్తెలిస్తే ఎంత కుమిలిపోతారు?

భూస్వాముల పిల్లల్ని కూలినాకొడుకుల పిల్లలు కొట్టడం కంటే ఘోరం ఈ భూప్రపంచం మీద యింకే ముంటది చెప్పండి. దాంతో పోల్చుకుంటే తరువాత జరిగిందేమీ పెద్ద విషయం కాదులెండి. కానీ చెప్పక తప్పదు.

ధర్మం ఇప్పటికే ఒంటికాలి మీద కుంటుతుంది. ఇలా వదిలేస్తే ఇంకేమీ మిగలదు కాబట్టి, ఈ కాస్త ధర్మాన్నన్నా నిలబెట్టడానికి ఈ కడజాతి కుక్కలకి బెత్తం దెబ్బ చూపిద్దాం అని పెద్దలంతా అనుకుని ఓ తీర్మానం చేసుకున్నామండి. అది కాస్త మోతాదు ఎక్కువైంది.

కొడదామని వెళ్లామండి. వాళ్లు దొరికితేనా, తిరగబడ్డారు. మన బలం ఎక్కువయ్యేసరికి రేసుకుక్కల్లాగా పరిగెత్తారు. తప్పు తెలుసుకుని దారికి వస్తే, దొరికితే దెబ్బలతో వదిలేద్దుం. కానీ తిరగబడి, పారిపోయేసరికి చిర్రెత్తుకొచ్చింది.

ఆ చిరాకులో కత్తులు తీసి ఓ పదిమందిని నరికేశాం. సరే వాడి ఆయువు మూడింది కాబట్టి చచ్చాడు, మీరు నరికారు కాబట్టి చచ్చాడా అన్నాడండీ మా ఊరి పూజారి అయ్యగారు. బ్రామ్మలున్నారే భలే తెలివైన వాళ్లు. ఆయువు మూడకపోతే పిడుగు మీద పడినా బతుకుతాడు, ఆ యమధర్మరాజు పాశం విసిరాడు కాబట్టి కత్తి మీ చేతికి వచ్చింది, వాడి పీక దానికి అందింది. మీరు నిమిత్తమాత్రులు అని చెప్పేడండీ పంతులుగారు.

వాళ్లు చనిపోయాక ఆ శవాల్ని చూస్తే వాళ్ల కుటుంబాలు ఎంత బాధపడతయ్యి. మళ్లా ఆళ్లకెందుకీ గోల, పోయినాడు ఎలాగూ పోయాడు. ఆడి శవాన్ని ఊళ్లేం చేసుకుంటారని మేం భద్రంగా మూటలు కట్టి కాలవలో పడేశామండీ. అయ్యి అయితంపూడి లాకులకి అడ్డం పడి ఆగిపోయినయ్యి. మా మంచితనం అర్థం కాని ఎదవలు ఆటిని బయటికి తీసి ఏదో వీరతాడు మెళ్లో ఏసుకు తిరిగినట్టు ఊరేగింపు తీశారు.

పంతులుగారిపాటి జ్ఞానం బొత్తిగాలేని పోలీసులు మా మీద కేసు పెట్టడం, కోర్టు మాకు శిక్షలు వేసెయ్యడం జరిగిపోయిందండీ. సరే పండగలనీ, పబ్బాలనీ పెరోలు మీద వచ్చేత్తన్నాం అనుకోండి. ఎంతైనా జైలులో కొంతకాలం వుండాల్సి వస్తుంది కదండీ. ఇబ్బందే. ముఖ్యమంత్రి అయిన మా బంధువు రెడ్డిగారు ఓ రెడ్డి లాయరుగారిని జడ్జీని చేసేడు. ఇది మామూలేనండి. కమ్మ ముఖ్యమంత్రి ఉంటే కమ్మవారిని జడ్జీలుగా ఏస్తారండి, రెడ్లుంటే రెడ్లని జడ్జీలుగా ఏసుకుంటారండి. ఆళ్లు మంచోళ్లు కాబట్టి, ఎక్కడి నుండి వచ్చారో గుర్తెట్టుకుని ఇలాంటి ఇబ్బందులొచ్చినప్పుడు ఓ కాపు కాస్తారండి.

మాల మాదిగ ఓట్లతో ముఖ్యమంత్రైనంత మాత్రాన ఆళ్ల కులపోళ్లని జడ్జీలుగా ఎయ్యాలని ఎక్కడా లేదండి. రిజర్వేషను తకరారు ఇక్కడ పెద్ద కోర్టుల్లో లేదండి. అయినా మాలమాదిగలకి, ఓట్లేసినందుకు గొర్రెలు, బర్రెలు, ఆటోలు, ఇళ్లు, డబ్బులు, మందు యిస్తున్నాం కదండీ. ఇక న్యాయం కూడా ఎందుకండీ?

ఇదీ గొడవ. మొత్తం నేనే చెప్పేత్తే అన్యాయం కదండీ. జోసప్పుగాడి గొడవ కూడా ఇనండి. సెలవండి.

*

**కుంటి జోసప్పుగాడి ఎదవగొడవ**

నిజమేనయ్యా... రచైతగారు మామీద ఇసుక్కోడంలో తప్పేమీలేదు. అందమైన ప్రేమకతలు చదవాలనుకుంటే ఇటు రామాకండయ్యా. అమాయకత్వం కూనీ అవుతుంటే అమాయకమైన ప్రేమకతలు ఎందుకు రావట్లేదనే దౌర్భాగ్యపు ముండా కొడుకులున్న చండాలమైన ప్రపంచమయ్యా యిది. అయినా మాలాంటోళ్ల కతలు నన్నయ, తిక్కన రాశారు గనకా ఇప్పుడు మీరు రాయడానికి. రాజుగారి చంకలో మట్టి నలిపితే అగ్రహారాలు వత్తయి. ఆ పనేగా మొన్నటిదాకా కవులు చేసింది. ఇప్పుడు సినిమాలో హీరోల చంకలో మట్టి నలుపుతారు. లేకుంటే దేవుళ్లని పొగిడితే ఆ దేవుడి పేరున్నంతవరకూ మీ పేరు కూడా వుంటది. మాబోటోళ్ల గురించి రాస్తే అక్షరాలు కూడా మలినం అయిపోతయ్యటయ్యా.

మా కతల్లో ఎప్పుడూ ఏడుపులూ పెడబొబ్బలేమీ ఉండవయ్యా. ఒంట్లో కాన్సరెట్టుకుని కూడా కంట్లో నీళ్లెట్టకుండా నవ్వుతానే గడుపుతామయ్యా. మాకూ బావామరదళ్ల సరసాలు, అత్తాకోడళ్ల పరాచికాలు, బావా బామ్మర్దుల ఎటకారాలు... ఇలా బానే వుంటామయ్యా మేం కూడా.

నేను మొదట్లో మామూలు జోసప్పునేనయ్యా... తర్వాత ఓ కుంటాడు నన్ను కుంటాడ్ని చేశాడు.

మా తాత మూతికి ముంత కట్టుకునేవాడు. ఉమ్మేస్తే నేల మీద ఉయ్యకుండా ముంతలో ఉయ్యాల. లేకపోతే నేల మైలపడుద్ది. ముడ్డికి తాడు

ఏలాడతా వుండేది. ఆ తాడు చివర తాటాకు ఉండేది. ఈడు నడిచించోట ఆ తాటాకు తుడిచేసేది. చేతిలో గంట ఉండేది. అంటరానివాడొత్తాన్నాడు తొలగండని బేపనవారికి హెచ్చరిక అది.

ఇంత గొప్ప సన్మానం మా జాతికి ఎంత కాలంగా జరుగుతోందో తెలీదు. ఇంత ఘనంగా, గొప్ప గౌరవ మర్యాదలతో బతికే అవకాశం మాకు ఈ హిందూమతం ఇచ్చిందయ్యా.

అయితే ఇంత మర్యాద తట్టుకోలేక మా ముడ్డి పగలగొట్టేవాడు రాముడైనా, భీముడైనా ఆడు మా దేవుడు కాదని మా తాతే తీర్మానించేడు.

ఆయనెవరో ఏసుప్రభువంట. వడ్రంగి కులంలో పుట్టాడంట. ఆయన మాకు ఇట్టాంటి మర్యాదలేమీ లేని మతమొకటి ఇచ్చి ఆయనే దేముడన్నాడు. అప్పుడు మా తాత ఎంకటు జోసప్పుగా మారేడు. ఆడి పేరు నాకెట్టేరు. మా నాన్న మోజేసు. అమ్మ సువార్తమ్మ.

మా తాత అనేవోడు ఈ తెల్లదొరలు రాకపోతే మనల్ని ఎప్పటికి ఇట్టానే గొడ్ల కంటే హీనంగా జూసే వోళ్లీ నాకొడుకులు అని.

తెల్లదొరలు మతమిచ్చారు, బట్టలిచ్చారు, చదువిచ్చారు, అన్నిటికన్నా ముక్కెంగా మేమూ మనుషులమే అన్నారు. నమ్మలేకపోయినాం.

మమ్మల్ని మనుషులన్నందుకు వేం మత ముచ్చుకుంటే మదమెక్కిన నా కొడుకులు మేం బట్టలకి, దుప్పట్లకీ మతం మార్చుకున్నామని పేల్తన్నారు.

మీ హిందూ దేవుళ్లు మా గుడ్డలూడదీశారు, దయామయుడు ఏసుబాబు మాకు బట్టలు కప్పాడు. ముడ్డి మీద గుడ్డ కప్పినోడు కాదు, నీ ముడ్డి కింద ముంత పొగెట్టినోడు దేవుడన్న మీ వాదన గొప్పగా వుంది కానీ మాకర్థం కావట్లేదు.

పొట్టేలు మనదే కదాని ముడ్డిలో కుమ్మిచ్చుకోలేం కదా. అట్టాగే హిందూ దేవుళ్లు ఇక్కడోళ్లని మొయ్యలేం. దళిత గోయిందం అని ఏడుకొండల ఎంకన్నని మా వాడల్లో తిప్పి మైలపడ్డాడని మూలనేశారే... మీరా మారేది?

నాకో కొడుకయ్యా. ఆడి పేరు రాజు. సాల్మన్ రాజు. సొలోమోను మహారాజు జ్ఞానం ఆ బిడ్డ మొహంలో కనపడేది. అందుకే ఆడికా పేరెట్టా. ఆడు చదువులో ఫస్టు. అందగాడు. మంచి ఆటగాడు. కబడ్డీ బరిలో ఆడు దిగేడంటే ఆవతల టీమంతటినీ ముట్టి కానీ వచ్చేవాడు కాదు. బహుశా మమ్మల్ని తరతరాలుగా ఎవర్నీ ముట్టుకోనీకుండా ఉంచినందుకేమో ఆడికి ముట్టుకోడం అంటే అంతిష్టం.

మంచి పాటగాడు. ఆడు పాడతంటే మగసింహం గొంతు సవ్వారు చేసుకున్నట్టుండేది. వంకీల జుట్టు నా బిడ్డది.

ఆడి అందం చూసి కాలేజికొచ్చే కామందుల ఆడపిల్లలు మోజుపడేవాళ్లు. ఓ పిల్లని ఈడూ యిష్టపడ్డాడు.

ఆడు మాలాగా చద్దన్నం తినేవోడు కాదు. ఏడేడి ఇడ్లీలు కావాలాడికి పొద్దటే. కమ్మటి కాపీ తాగేవోడు. మా తాత జోసప్పు రైల్వేలో గాంగుమేను. ఆడుపోయాక అదే ఉజ్జోగం మా బాబుకీ, ఆడు బతికుండగానే నాక్కూడా గేంగుమేను ఉజ్జోగం వచ్చాయి. మేం మూడు తరాల నుండీ కూలీకి పోయిందే లేదు.

అయినా ఈ రెడ్డిగార్లూ, కమ్మదొరలూ మమ్మల్ని వాళ్ల కూలీల్లాగే చూసేవాళ్లు. అరేయ్... తురేయ్ అని పిలిచేవాళ్లు. పడ్డాం. భరించాం. భరించక చేసేదేంటి? కూలీకెళ్లిన మాలమాదిగ ఆడపిల్లల్ని కామందులు పొలంలోంచి జబ్బట్టుకు లాక్కెళ్లి పాడుచేసినపుడే మాట్టాడలేదు. అరేయ్... తురేయ్ అంటే మాట్టాడతామా?

అయితే అయ్యా... మా సాల్మన్‌రాజుగాడు ఓ కామందుల ఆడపిల్లని యిష్టపడ్డాడు. ఆ పిల్లా ఆడ్ని ఇష్టపడింది. ఇద్దరూ కాలేజీకి ఎల్లేప్పుడు, వచ్చేప్పుడు చిలకాగోరింకల్లా కబుర్లు చెప్పుకుంటూ ఉండేవాళ్లు.

కామందులకి ఇది గిట్టలేదు. మాలనాకొడుక్కి కమ్మవారమ్మాయి, రెడ్డిగారి పాపా కావల్సి వచ్చారా అని అనుకునేవోళ్లు. ఆళ్లని బతకనిత్తే, మనువాడుకోనిత్తే కమ్మటి, అమాయకమైన ప్రేమకథ పుట్టేదయ్యా.

కాని వాళ్లు మమ్మల్ని తెగ నరకాలని కత్తులకి పదునెట్టుకున్నారు. వాళ్లు మా ఆడబిడ్డల్ని పాడు చెయ్యవచ్చు... ఆళ్లకా హక్కుంది... కానీ మా కుర్రాడు ఆళ్ల ఆడపిల్లని పెళ్లికూడా చేసుకోకూడదు. అదీ న్యాయం. దీన్నే రామరాజ్యం అంటారంట.

ఓ రోజున కాలేజి నుండి వత్తన్నపుడు బస్సులో ఆడు ఆ పిల్లతో... అదే... నా కోడలు పిల్లతో మాట్లాడతన్నాడు. కామందుల కుర్రాడు ఈడ్ని బూతులు తిట్టాడు. 'మాలనాకొడకా... ఆ కమ్మవారి పిల్లతో ఏంట్రా పరాచికాలు,' అని. ఈడికి కోపమొచ్చి 'ఇద్దరికీ ఇట్టమై మాటాడుకుంటే నీదేం బోయిందిరా నా కొడకా,' అన్నాడు.

ఆడు చెయ్యెత్తేడు. ఈడు ఆడి చెయ్య తీసేసేడు.

ఇక ఆరోజు రాత్రి చూడాలి బాబూ. రాములోరి రథయాత్ర జరిగినట్టు మా మీద దండెత్తేరు. కత్తులు, కటార్లు, ఈటెలు, బళ్లేలు పట్టుకుని వచ్చేరు. వాళ్లు దండెత్తి వస్తుంటే ధూళి అంతెత్తు ఎగిరింది.

మా గుడిసెలకి నిప్పెట్టేరు. మా అమ్మల్ని మానాల మీద తన్నేరు. ఆడబిడ్డల్ని మళ్లా పాడుచేసేరు. దొరికినోడ్ని దొరికినట్టు నరికేరు.

పొలాలకి అడ్డంపడి పారిపోయాం, మా ఆడోళ్లనీ, ముసలోళ్లనీ, చిన్నపిల్లల్నీ వాళ్ల కర్మానికి ఒదిలేసి.

ఎంటపడ్డారు. ఎగబడ్డారు. నరికేశారు. కిందేసి తొక్కేశారు. గోనెసంచుల్లో కుక్కేశారు. పంటకాలవలో పడేశారు.

నా బిడ్డని, చందమామలాంటి మొహం మీద కాళ్లతో తన్నేరు. బాకుల్తో వాడి ముక్కు కోశారు. గిరజాల జుత్తునిండా ఆడి నెత్తురు. తడిసి అట్టలు కట్టింది. వాడి అంగం కోసేరు. ఛాతీ మీద కోసి, 'ఏరా ఈ గుండెకాయ తోనేనా మా ఆడపిల్లని ప్రేమించింది?' అని ఆడి గుండె కాయ బయటకి తీసేరు.

ఆ బిడ్డని చేతుల్లో పెట్టుకుని ఏడ్చేను నేను. ఏడుపు మాకు అలవాటే. తరతరాలుగా మా జాతికి జరిగినయ్యి ఇలాంటి రాచమర్యాదలే.

చిన్నబిడ్డ... నా చేతుల్లో పెరిగిన బిడ్డ. నా అర చెయ్యి నుండి మోచేతుల్దాకా ఉండే పసిబిడ్డ... గారా బాలు పోయిన బిడ్డ... నా చేతితో పెరుగు బువ్వ తిన్న చిన్న పిల్లాడు... నాన్నా... నాన్నా... అని నోరారా నన్ను పిలిచినోడు... ఆడు నన్ను నాన్నా అని పిలిచినప్పుడల్లా దేముడు నాతో మాట్టాడతన్నట్టుండేది... వాడు... పుట్టిన తర్వాత నాకు ఎంతో సంతోషాన్నిచ్చినవాడు... వాడి చక్క నాల ముక్కు రక్కబడి, గుండె చీల్చబడి నా చేతుల్లో ఉన్నాడు. కాదు చేతుల్లో పెట్టేరు. ఇరవై ఏళ్లు అత్తార బత్తంగా పెంచుకున్న బిడ్డని అన్యాయంగా చంపేశారు.

ఓ అమ్మాయిని ఇష్టపడితే ఇంత శిక్షా అని అడుగుతున్నట్టు ఆడి కళ్లు తెరుచుకునే ఉన్నాయి. కని పించని దేవుడ్ని అడుగుతున్నాయి. పెద్ద కళ్లు... అంద మైన కళ్లు... తెల్లటి నిర్మలమైన కళ్లు...

అప్పుడే ఓ కుంటాడు నన్ను తరిమాడయ్యా... కుంటాడెలా తరుముతాడని ధర్మపెబువులు... మీకు అనుమానం రావచ్చు... ఎంట పదిమంది ఉంటే కుంటాడు కూడా ఏటాడతాడయ్యా... అది అనుభవ మైతే బాగా తెలుత్తదండయ్యా...

ఈ మద్దెన ఢిల్లీలో ఓ ఆడబిడ్డని మైనరుబాబు పాడుచేసి మానంలో ఇనపరాడ్డు గుచ్చి చంపితే బుడ్డోడు ఇంత పనెలా చేశాడు? చేసుండడు... ఎందుకంటే ఆడు బుడ్డోడు అని అనుకోగలిగిన ఇశాలమైన మనసున్న మారాజులకే ఇలా కుంటోడెలా తరుంతాడోయి అని అనుమానాలు రాగలవయ్యా...

ఆ కుంటోడు పగట్టినట్టు నా కాలిమీదే కొట్టేడు... నా కాలిరిగి కుంటి జోసప్పునయ్యాను... నా బతుకు ఇరిగి శవాన్నయ్యాను... అప్పుడు ఇగిరిపోయింది నా నోట్లో తడి. ఉయ్యాలన్నా ఉయ్యలేను.

ఉయ్యాలనుంది... దేవుళ్ల మీదా... మమ్మల్ని మనుషులు కాదన్న వాళ్లమీదా... కడజాతివాళ్లని అన్న వాళ్ల మీదా... నా బిడ్డని పొట్టనపెట్టుకున్న అందరి మీదా...

*

కింద కోర్టులో శిక్ష పడిందని సంబరపడ్డాం. కానీ పెద్ద కోర్టులో ఆళ్ల కులపోడి దగ్గరకే మళ్లా ఎళ్లింది కేసు. పెద్ద కోర్టు, పెద్ద జడ్జిగారు... అన్యాయం జరగదను కున్నాం.

"ఇంకా కులాలెక్కడున్నాయి?" అన్నాడు జడ్జీ గారు.

"ఈయన పేరేటి?" అడిగాను పక్కనాయన్ని.

"ఎంగళ రెడ్డి," అన్నాడు పక్కనాయన.

"గురియిందగింజ ముడ్డికింద నలుపు మర్సిపో యిందంట," అన్నా.

అప్పుడు ఊరటం మొదలెట్టింది నా నోట్లో ఉమ్ము... చాలా సంవత్సరాల తర్వాత. మా తాత మట్టి కుండలో ఊసింది ఈ ఉమ్మే అనుకుంటా.

"అంతమందిని నరికితే ఎవడూ ఎందుకు కంప్లేంట్ ఇయ్యలా? దొంగకేసు," అన్నాడాయన.

నిన్నెపుడైనా ఎవుడైనా తరిమాడా? నీ అమ్మని మానం మీద తన్నాడా? పొలంలో మీ ఇంటి ఆడబిడ్డని చెయ్యట్టుకు లాక్కెళ్లాడా... అయి జరిగినపుడు ఎలా ఉంటదో నీకు తెలుసా అని అడుగుదామని నోరు తెరిచా...

నోట్లోంచి మాట రాలే... మాట బదులు ఉమ్మొ చ్చింది... ఊశా... అదాయన మొహం మీద పడిం దయ్యా... ముంతలో పడాల్సింది పొరపాట్న ఆయన మొగాన పడింది...

థూ...

ఆదివారం విశాలాంధ్ర, 15జూన్ 2014